# 39

# జ్ఞానోదయం

హంపీ నగరంలో 'కళావతి' అనే నర్తకి ఉండేది.

ఆమె జానపద శైలిలో నాట్యం చేసేది. అందువల్ల సామాన్య ప్రజలు మాత్రమే ఆమె నాట్యాన్ని ఎక్కువగా చూసి ఆనందించేవారు. శాస్త్రీయ నృత్యం ఆమెకు రాదు. ఆ కారణంగా రాజాస్థానంలో గానీ, సభలలో గానీ నాట్యం చేసే అవకాశం ఆమెకి లభించలేదు.

పాటక జనం కోసం నృత్యం చేస్తున్నందువల్ల అందరూ ఆమెను చిన్న చూపు చూసేవారు. సంఘంలో గౌరవం ఉండేదికాదు. కానీ.., ఆమె ఎవరు ఏమనుకున్నా లెక్క చేసేదికాదు. ఆమెకి ఆరేళ్ళకూతురు వుంది. ఆ పిల్ల పేరు... రేఖ!

ఒక రోజున ఒక సన్యాసి దూర ప్రయాణం చేస్తూ హంపీ నగరంలో ఆగాడు. రాత్రి కావడంతో కళావతి ఇంటి అరుగు మీద విశ్రాంతి తీసుకున్నాడు.

ఆ వేళలో కూడా జనం ఆ ఇంటికి రావడం, కళావతి ఆడిపాడటం చూశాడు సన్యాసి. అతనికి కళావతి మీద అసహ్యం కూడా కలిగింది. అయినా... 'ఒకరాత్రి విశ్రాంతి తీసుకుని వెళ్లిపోయేవాడిని. ఇవన్నీ నాకెందుకు?' అని సరిపెట్టుకుని నడుం వాల్చాడు.

అరుగు మీద సన్యాసి వుండటం గమనించింది కళావతి. కూతురుద్వారా ఆయనకు పళ్ళూ, పాలూ పంపింది.

కానీ.., 'కళావతి లాంటి బజారుమనిషి పంపినవి నేను తినడమా..?' అనుకున్న సన్యాసి వాటిని తిరస్కరించాడు.

మరునాడు ఉదయమే నిద్రలేచిన సన్యాసి స్నానానికి బయలు దేరాడు.

కానీ... కళావతికి రెండిళ్ళ అవతలవున్న ఇంటిలో ఎవరో వ్యక్తి చనిపోయాడు. ఆ వ్యక్తి భార్యాబిడ్డలు గోలుగోలున ఏడవసాగారు. నలుగురూ ఆ ఇంటి ముందు పోగయ్యారు.



కళావతి కూడా ఆరేళ్ళ కూతురు రేఖతో పాటు ఇంటిలో నుండి బయటకు వచ్చింది.

"అమ్మా రేఖా ! నువ్వు వెళ్లి ఆ చనిపోయిన మనిషి స్వర్గానికి వెళ్లాడో, నరకానికి వెళ్లాడో తెలుసుకొనిరా!" అంది కళావతి.

ఆ మాటలు వినగానే సన్యాసికి ఎక్కడలేని ఆశ్చర్యం వేసింది. ఏం జరుగుతోందో చూద్దామని అక్కడే ఆగిపోయాడు.

కొద్దిసేపటికి రేఖ తిరిగి వచ్చింది.

"అమ్మా! ఆయన స్వర్గానికే వెళ్లాడు" అంది రేఖ.

ఆరేళ్ళ రేఖ అలా మాట్లాడటం విని సన్యాసి ఆశ్చర్యపోయాడు. ఉండబట్టలేక కళావతిని అడిగాడు.

"అమ్మా! నేను సర్వసంగ పరిత్యాగిని. నిత్యమూ భగవంతుని పేరే జపించేవాడిని. అయినా... చనిపోయిన మనిషి ఏ లోకానికి వెళ్లాడో నేను తెలుసుకోలేను. కానీ, నీలాంటి వీధి నాట్యగత్తె కూతురు – అందులోనూ... ఆరేళ్ళ పసిది మరణించిన ఆ వ్యక్తి ఏ లోకానికి వెళ్లాడో ఎలా గ్రహించింది?" అని అడిగాడు.

"అదేమంత కష్టం స్వామీ ?! మా అమ్మాయి ఆ ఇంటి దగ్గరకు వెళ్లి అక్కడకు చేరిన జనం ఆ వ్యక్తిని గురించి ఏమనుకుంటున్నారో విన్నది. మంచిగా అనుకుంటుంటే స్వర్గానికి వెళ్లినట్టు..,చెడుగా అనుకుంటుంటే నరకానికి వెళ్లినట్టు ..!" అంది కళావతి వినయంగా.

అంతవరకు తాను సర్వసంగ పరిత్యాగిననీ, దైవభక్తుడిననీ అహంకరించి, కళావతిని అల్పురాలిగా భావించిన సన్యాసికి జ్ఞానోదయం అయింది.

★★★

